విహారయాత్రకు
వెళ్ళిన
ఆ భార్యాభర్తలకు
అక్కడెదురైన
అనుభవం?

**పి.వి.డి.ఎస్. ప్రకాష్ కథ**

# గోడమీది రాతలు

ఇసుకలో నడుస్తున్నారిద్దరూ. కూరుకుపోతున్న పాదాలను బలవంతంగా పైకి లాగుతూ.

ప్రక్కనే నురగలు కక్కుతున్న కెరటాలతో

నీలి సముద్రం ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది.

"ఎంత రమణీయంగా ఉందిక్కడ. నిజానికి ఆకలి దప్పులే లేకుంటే ఎన్ని యుగాలైనా ఇలా ఉండిపోవచ్చు. ఏం డియర్" అంది శాంతి.

ఆమె చేతివేళ్ళు నలుగుతున్నాయి అతని పిడికిలిలో.

ఆమె కళ్ళు వెలుగుతున్నాయి ఆనంద లోకాలకు దారి చూపుతూ.

నీటిలో తడిసిన గాలి తాకుతోంది ఆ ఇద్దరినీ మెల్లగా, మెల్లగా.

దూరంగా ఎర్రమట్టి దిబ్బలు కనిపిస్తున్నాయి. సరుగుడు చెట్ల సంగీతం వినసొంపుగా ఉంది.

"చాలా దూరం వచ్చేసాం?" అంది శాంతి మళ్ళీ

వెనక్కి తిరిగి చూస్తే వారి పాదముద్రలు కనబడుతున్నాయి— అందంగా.

ఇంకా వెనక్కి చూపుసారిస్తే కొండను తవ్వి నూతనంగా కట్టిన 'నేరెళ్ళ వలస కాలనీ' ఇళ్ళు చిన్నపిల్లలు పేర్చిన బొమ్మరిళ్ళులా భ్రాంతికొలుపుతున్నాయి. ఆ కొండ మీదే నృసింహహస్వామి ఆలయం కన్పిస్తోంది

అవును— అది భీమిలి.

'ఎన్ని జ్ఞాపకాలు ఇక్కడ విడిచి వెళ్ళాడో



తను' అనుకుంటున్నాడు మాధవ్.

"ఏమిటా మౌనం" నిశ్శబ్దాన్ని బద్దలుచేస్తూ శాంతి కంఠధ్వని— అది ఓ సంగీత రసధుని.

"మౌనం కాదు— ధ్యానం" మాధవ్ సమాధానం.

అవును—

ఎవరికోసం ఈ తపన?

ఎవరికోసం ఈ తపసు??

చూస్తున్నాడు ఆమెవంక మాధవ్.

చిరుగాలికి తుమ్మెద రెక్కల్లాంటి ఆమె శిరోజాలు రేగి ముఖాన్ని కప్పేసాయి. కొనగోటితో సవరిస్తోందామె.

ఆమె—

ఆమె ఎవరు?

వందన కాదుకదా?

ఇదే బీచిలో ఇలాంటి సాయంత్రమే ఆమెతో గడిపిన క్షణాలు గుర్తొచ్చాయి మాధవ్‌కి.

"ఎవరికోసం ఈ ధ్యానం?"

శాంతి మాపులు వలపు తూపులయి ఎదలో గుచ్చుకొంటూ తీయని బాధతో సన్నగా నవ్వాడు మాధవ్

"ఈ ఎవరికోసం— ఈ సిరికోసం"

"మాధవ్!" అంటూ అతనికి దగ్గరగా వచ్చింది శాంతి.

"వందనా!" చేతులు సాచి సాదరంగా ఆహ్వానించాడు మాధవ్

"ఎవరు— వందన?" చటుక్కున అడిగింది శాంతి. ఆమె కళ్ళలో అసూయ రెపరెపలాడింది.

తడబడ్డాడు మాధవ్.

కాని, అంతలోనే తేరుకొని "వందన కాదు. వందనం. అభివందనం. నీ సౌందర్యానికి సుమవందనం" అన్నాడు కవిత్వధోరణితో.

"అలాగా!"

నవ్వింది శాంతి.

వేయిపున్నములు అపుడే విచ్చుకొన్నట్లు—

వేయి వీణియలు ఒకసారి రవళించినట్లు —

వేయి గులాబీలు ఒకేమారు పరిమళించినట్లు— పలకరించినట్లు నవ్వింది శాంతి.

కదలి కదలి ఉవ్వెత్తున ఎగిసిన కడలి కెరటం ఒకటి వాళ్ళదగ్గర విరిగిపడింది పాదాలను అభిషేకిస్తూ.

ఆమె చీరకుచ్చిళ్ళు తడిసిపోయాయి.

ఉలిక్కిపడింది శాంతి—మాధవ్ దగ్గరగా జరిగి హృదయంపై ఒరిగిపోతూ.

హత్తుకొన్నాడామెను.

ఆ కౌగిలింతలో ఎన్నో... ఎన్నో పులకింతలు.

గాలికూడా జొరపడ వీలుకాని దగ్గరగా ఒకరినొకరు చుట్టి పెనుకొంటుంటే—

ఇద్దరిలో ఏదో ఆవేశం!

ఇద్దరిలో ఏదో మైకం!!

ఆమె నుదుట కుంకుమ చిరుచెమటకు కరిగి అతని తెల్లని షర్టుపై 'ముద్ర' వేస్తుంటే అన్నాడు— "నీ కోసమే ఈ సాయంసంధ్య కుంకుమ ఆరబోసింది"

"అవును! కొద్ది క్షణాలలో నా కాటుక చీకటవుతుంది— ఈ కౌగిట కరిగేందుకు" అంది శాంతి.

"మాధవ్!"

"శాంతీ!"

"ఏయ్! ఎవరది! ఏం చేస్తున్నారక్కడ?'' గద్దింపు వినబడి ఒక్కసారి దూరమయ్యారు ఇద్దరూ.

శాంతి సిగ్గుబడి తలదించుకుంది.

వారు చేపలుపట్టే జాలరులు. సముద్రం నుంచి వచ్చారపుడే. చేతులలో వలలున్నాయి

బలిష్టంగా పెరిగిన దేహాలు, వంపులు తిరిగిన కండరాలతో నల్లగా రాక్షసులను తలపించేటట్లున్నారు— ఆ ఇద్దరూ.

''ఏం చేస్తున్నారు?'' అందులో ఒకడడిగాడు.

''ఏం చేస్తార్రి? ఒక ఆడది— ఒక మగాడు'' మరొకడి సమాధానం.

జనసంచారం అట్టేలేని చోటది.

శాంతికి భయం వేసింది.

''ఏం లేదు. ఊరికినే షికారుగా వచ్చామిక్కడికి'' మాధవ్‌కి చాలా జుగుప్సగా ఉంది. ఈ సంఘటన ఎదురవడంతో.

వారి చూపులు శాంతిని తినేసేటట్లున్నాయి.

అది భరించలేకపోతున్నాడు మాధవ్.

''ఛీ! అనవసరంగా ఇక్కడికి వచ్చాం'' అనుకున్నాడు మాధవ్.

''ఏవూరుమంది?'' వెటకారంగా అడిగాడొకడు.

''విశాఖపట్నం''

''పిట్ట చాలా బావుందిరా— ఎర్రిగా'' మరొకడు.

''అవును— ఓ సూపుసూస్తే''

మాధవ్‌కి అగాధంలోకి కూరుకుపోతున్నట్లనిపించింది.

''కొంపతీసి నా శాంతిని వీరికాహుతి చేయడుకదా!''


ఒళ్ళు గగుర్పాటు చెందుతోంది.

లాభం లేదు.

వారినడ్డగించకపోతే ఈ 'భీమిలి బీచి' జీవితంలో మరిచిపోలేని మరో అనుభవాన్ని అందిస్తుంది.

''చూడండి. మీరు పొరపడుతున్నారు. మేం భార్యాభర్తలమే! ఈ ఆదివారం సరదాగా గడుపుదామని ఇక్కడికి వచ్చాం. అంతేకాని, మరోలా ఊహించుకుని మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి'' మాధవ్ బతిమాలుతున్న ధోరణిలో అన్నాడు.

''అందరూ ఇట్టాగే సెబుతారు. పెళ్ళాడిన 'ఆలూ—మగల'కి ఇంట్లో సోటుండదా



ఇదేదో యవ్వారమే! సరే, నీ దోవేదో నీవూ సూసుకో! కానీ, మాకో సాన్సియ్యి'' జబర్దస్తీగా అంటూ ముందుకొచ్చారు వారు.

''నడు—శాంతీ! వీరికి సంజాయిషీ చెప్పుకోవాల్సిన ఖర్మ మనకి లేదు. పద—వెడదాం'' అన్నాడు మాధవ్ శాంతి చేయందుకుని ముందుకు నడుస్తూ.

అంతే!

మాధవ్ భుజంమీద దెబ్బపడింది.

మరొకుడు శాంతిని పట్టుకుని పడవల చాటుకి లాక్కుపోతున్నాడు.

శాంతి అరుపులు దిక్కులు దద్దరిల్లేలా ఉన్నాయి.

మాధవ్‌కి పౌరుషం ప్రజ్వరిల్లింది. తానూ బలం పుంజుకొని విసురుగా అతని మీదకు వెళ్ళాడు.

విచక్షణా రాహిత్యంతో ఒకరినొకరు ఎక్కడ పడితే అక్కడ కొట్టుకుంటున్నారు.

''భగవాన్! ఎందుకిలా జరిగింది'' మాధవ్ మనసులో ఆవేదన.

నిన్న రాత్రి మాధవ్‌ని అడిగింది శాంతి — 'భీమిలి' వెడదామని.

భీమిలి పేరు వినగానే మాధవ్‌కి వందన గుర్తుకొచ్చింది.

హృదయంలో ఏదో స్పందన.

''ఏమండీ! రేపే వెడదాం. ప్రకృతి దృశ్యాలలో అందాలకే హారతిపట్టే 'భీమిలి' ని చూడాలనుంది. తీసుకెళ్ళరూ!''

''సరే!'' అనక తప్పలేదు మాధవ్‌కి.

ఆనాడు సీత— రామచంద్రులవారిని బంగారులేడి కావాలని అడిగింది. ఆ కోరిక వియోగానికి దారితీసింది.

ఇప్పుడు— శాంతి కోరిక మరో కథ కాదు కదా!

''భార్యని రక్షించుకోలేని మగాడు, తనేం మగవాడు?''

అతని శక్తి సన్నగిల్లిపోతోంది.

కళ్ళముందు సప్తవర్ణాల ఇంద్రధనుసు కనబడుతోంది.

కళ్ళు తెరిచాడు మాధవ్.

చుట్టూ చూశాడు.

తను— ఒక పూరిపాకలో అక్కడక్కడా తెగిపోయిన నులకమంచంమీద పడుకుని ఉన్నాడు.

''ఎవరిది ఈ ఇల్లు! ఎలా వచ్చాడిక్కడికి తను'' లేవబోయాడు మాధవ్.

ఒళ్ళంతా నొప్పులు.

జరిగిందంతా గుర్తుకొచ్చింది మాధవ్‌కి.

శాంతి!

నా శాంతి ఏది?

జీవితంలో తను వందనని కోల్పోయాడు. ఇక, శాంతినికూడానా!

తనింత దురదృష్టవంతుడెందుకయ్యాడు?

జంటగా 'భీమిలి' వచ్చి ఒంటరిగా విశాఖవెళ్ళి తల్లికెలా ముఖం చూపగలడు?

గబగబా లేచాడు మాధవ్ వంటి నొప్పుల్ని సైతం లెక్కచేయకుండా.

తలవంచి బయటకు వచ్చాడు.

అప్పుడే సూర్యోదయమైంది. చీకటిని చీల్చే ఈ ఉషస్సంటే తనకెంతో ప్రీతి.

మరి, ఈ ఉషస్సు తనకేం మిగిల్చి ఉంటుంది?

కేవలం చీకటినేనా?

అతని కంట్లో నీటిపొర.

తడికల్తో కట్టిన గదిలోంచి బయటకు వచ్చింది శాంతి.

అప్పుడే ఆమె ముఖం కడిగినట్లుంది.

"శాంతీ!" పిలిచాడు మాధవ్ ప్రేమగా

"ఊ!"

ఇద్దరూ ఒకరినొకరూ అలా చూస్తుండి పోయారు.

అలా ఎంతసేపో?

ముందుగా శాంతే తేరుకొంది— "రండి లోపలికి"

ఇద్దరూ లోపలికి వెళ్ళారు మళ్ళీ.

శాంతి నడుస్తుంటే వినిపిస్తున్న కాలి అందెల రవళిలో రామాయణ గానం వినిపించింది మాధవ్‌కి.

శాంతిలో సీత కనిపించింది

ఆ గుడిసె— ఒక 'గుడి'లా—

అరణ్యావాసంలోని 'పర్ణశాల'లా అందంగా కన్పించింది.

అది ఒక క్షణంమాత్రం సేపే.

"శాంతీ! నీకు... నీకు..." మిగతా మాటలు అతని నోటిలోనే ఆగిపోయాయి.

చల్లగాలి తగిలిన మేఘంలా వర్షించసాగాయి శాంతి కళ్ళు.

"శాంతీ!" ఓదార్పుగా దగ్గరకు తీసుకున్నాడు మాధవ్.

"భగవంతుడు మన పక్షాన ఉన్నాడు. ఏ అన్యాయం జరగలేదు..." అంది శాంతి.

"టీ తాగండి, బాబూ!" గబుక్కున రాబోయిన వ్యక్తి అంతలోనే అతి దగ్గరగా ఉన్న వారిద్దర్నీ చూసి బయటకు వెళ్ళిపోయాడు.

శాంతి— మాధవ్‌నుండి విడివడింది.

"రా! తాతా, లోపలికి. ఫర్వాలేదు" పిలిచింది శాంతి.

అతను లోపలికి వచ్చాడు.

ముఖంనిండా ముడతలు అతని జీవితాన్ని వయసుని, అనుభవాన్ని చెప్పకనే చెబుతున్నాయి.



## సందేహం

క్లాస్‌లోని పిల్లలందర్నీ ఉద్దేశించి చెప్పారు మాస్టారు—
"భారతీయులందరూ సోదరీ సోదరులు"
"సార్! మరి మా అమ్మానాన్నలు ఆలుమగలు కద్సార్'''
అనుమానం వ్యక్తం చేశాడు పింకూ.

—ప్రేమ్ నజీర్ (కర్నూలు)

''ఇతనేనండి మన పాలిట దేవుడు. మీరు అలసి పోరాడలేక కళ్ళు తిరిగి పడిపోయినప్పుడు ఇతనే వచ్చి రక్షించారు. ఇతని వయసుకి గౌరవమిచ్చి వారూ తప్పుకొన్నారు''

''నువ్వా, తాతా!'' అన్నాడు మాధవ్, అనుకోకుండా పైకి.

''మీకిదివరకే తెలుసా?'' అడిగింది శాంతి, మాధవ్ అడిగిన తీరుకి ఆశ్చర్యపడుతూ

''ఎవరు బాబూ! వయసు పెద్దపులిలా మీదపడేసరికి చూపు సరిగ్గా ఆనడం లేదు'' అన్నాడతను.

''నేనే తాతా! నీకు జ్ఞాపకం రాలేదూ. నువ్వు సముద్రపు గవ్వలు అమ్ముతుంటావు కదా! ఒకసారి నేనూ కొన్నాను— నీ దగ్గర'' అన్నాడు మాధవ్.

తాత మాధవ్ దగ్గరగా వచ్చి పరిశీలనగా చూసాడు.

రెండు సంవత్సరాల క్రితం ఇతన్ని చూసినట్లు గుర్తుకొచ్చిందతనికి.

అవును— బేరమాడకుండా అడిగినంతా ఇచ్చి కొన్నవారిని కొంచెం కష్టమయినా గుర్తుపట్టగలరు— వ్యాపారస్థులు.

''బాబూ! నీతో వచ్చిందే ఆడమనిషి. ఆ పిల్లేనా బాబూ, ఈ పిల్ల'' అడిగాడు ముసలితాత.

భగవంతుడు మంచి రచయిత. అప్రధానమయిన పాత్రలాగ కనిపించే వ్యక్తి రసవత్తరమయిన కథ మలుపుకి ప్రధానుడవుతాడు.

నాలిక్కరుచుకొన్నాడు మాధవ్— ''ఇతనికెందుకు గుర్తుచేసానా?'' అని.

అప్పుడు— 'వందన'తో వచ్చాడు మాధవ్ బీచికి షికారుగా ఓ సాయంత్రం వేళ.

ఈ తాత సంచిలో గవ్వలు పెట్టుకుని వెదుతున్నాడు.

వందన చూసింది.

''మాధవ్! గవ్వలు కొందాం'' మారాం చేసింది.

పిలిచాడు మాధవ్.

''అమ్మాయి పేరు... అదేదో! ఆ! 'వందనమ్మగోరు'కదా! పోల్చుకోలేకపోయాను పాపా, ఏమనుకోకు'' అన్నాడు ముసలితాత.

ఆశ్చర్యంగా చూస్తోంది ఇద్దరివంక శాంతి.

''బాబూ! ఎప్పుడయింది పెళ్ళి. పెళ్ళికి పిలిచి 'పప్పన్నం' పెడతానన్నావు. మాటే మరసినట్లున్నావు'' అంటున్నాడు తాత.

మాధవ్ శాంతి వంక చూశాడు.

ఆమె కళ్లు ప్రశ్నార్థకంగా చూస్తున్నాయి

''బాబూ! పెపంచకం పాడయిపోయింది. నిన్నటికి నిన్న సూశావుకదా! ఎంత గండం దాటిందో?''

''అవును— తాతా! నీవురాకపోతే మేమే మయేవారమో కదా!'' కృతజ్ఞతగా చూస్తు అన్నాడు మాధవ్.

''వందన తల్లీ! మర్చిపోయావమ్మా నన్ను'' అడిగాడు తాత మళ్ళీ.

శాంతి విసురుగా కసురుకున్నట్లుంది— ''తాతా! నేను 'వందన'ను కాను. నాపేరు — శాంతి''

''అంటే'' ముసలితాత భ్రుకుటి ముడి

వడింది.

"మాధవ్ బాబూ! వందనేది? ఆ పిల్లని పెళ్ళాడలేదా?" అతని కళ్ళు అనుమానంగా చూస్తున్నాయి మాధవ్‌ని.

"ఊహూ!" అతనికి అబద్ధం చెప్పాలని పించలేదెందుకో?

"ఏం?"

తాత కళ్ళముందు నిన్నటి సంఘటన కదిలింది. కర్కశంగా బలముందన్న అహంతో ఆడదాన్ని లోబరుకోవాలని చూశారు— నిన్న.

వారికి మానవతా విలువలు తెలీవు. ప్రేమ తెలీదు.

కేవలం కామం తప్ప.

కానీ, నీవో...

ఆ భావాన్ని తాత ముఖంమీది ముడతలలో చదివాడు మాధవ్.

శాంతికి నిన్నటి మాధవ్ మాటలు గుర్తుకొచ్చాయి—

"వందన కాదు. వందనం. అభివందనం. నీ సౌందర్యానికి సుమచందనం" వ్యంగ్యంగా అంది శాంతి.

మాధవ్ అన్నాడు పైకి— "శాంతీ! మనం 'భీమిలి' రాకుండా ఉండాల్సింది"

"అవును. రాకుండా ఉండాల్సింది. ఉంటే నిన్నటి గండం ఎదురయ్యేది కాదు. నా జీవితంలో ఉన్న 'సుడిగుండం' పైకి తేలేది కాదు— నాకు తెలిసేది కాదు. అవును. రాకుండా ఉండాల్సింది— భీమిలి"

"శాంతీ!"

ఆమె ఏడుస్తోంది.

తాత అంటున్నాడు— "నా జీవితంలో ఈ బీచిలో తిరిగిన జంటల్నెందర్నో చూశాను. కొందరు ప్రేమికులు, మరికొందరు కాముకులు. ఎందరితోనో మట్లాడాను. అందరూ ఇంచుమించు వారిద్దరూ ఒకటయ్యాక ఇంటికి రమ్మని పిలిచినవారే! అయితే, ఏ ఒక్క జంటా ఆ తరువాత మళ్ళీ కలువలేదు. మిమ్మల్ని ఆరోజు అంత సరదాగా తిరగడం చూశాక అనుకున్నాను.



## ఓటమి

భీష్మ పితామహుడు, బి.జె.పి మూలవిరాట్, రామరథ యాత్ర సారధి ఎల్.కె.అద్వానీకి ప్రత్యర్థిగా నిలిచి ఎన్నికల్లో గెలవడం అంటే మాటలా... ఎంత రాజేష్‌ఖన్నా అయితేమాత్రం.

రాజేష్‌ఖన్నా ఓటమితో... కాంగ్రెస్ సహచరులు ఏమంటున్నారో తెలుసా... "రాజేష్‌ఖన్నా ఎన్నికల ప్రచారంలో ప్రవర్తించిన తీరు రాజకీయ నాయకుడిలా లేదు. ఓ ఫిల్మ్‌స్టార్‌లా ప్రవర్తించాడు. షెడ్యూల్స్ ప్రకారం మీటింగ్స్‌కి హాజరుకాకుండా ప్రజలు ఎదురుచూసి... చూసి విసిగిపోయేలా ఎప్పుడూ ఆలస్యంగా వెళ్ళేవాడు. అంతెందుకు ఆఖరికి... విలేకరులతో కూడా అతని విధానం వింతగా, విచిత్రంగా ఉండేది..." ఇదండీవరస.

—వింజమూరి కృష్ణమూర్తి

'ఆది దంపతు'ల్లా ఉన్నారని. కాని... కాని... కాలేదు''

''తాతా! అంతా 'విధి'. మన చేతుల్లో— చేతల్లో ఏం లేదు''

''చేయి కాలిన పరిస్థితులలో చేతకాని పరిస్థితులలో మాట్లాడేది వేదాంతం. కట్టుకోవలసిన ఆడదాని చేతిని ఒకసారి పట్టుకున్నాక విడువకూడదు'' అన్నాడు తాత.

''రాత్రుళ్ళు మీ విశాలవక్షంపై తలవాల్చి అనుకునేదాన్ని— నా అంత అదృష్టవంతురాలు లేదని. గుమ్మంలో మీ గురించి ఎదురుచూస్తూ అనుకునేదాన్ని— నా అంత సౌభాగ్యవతి లేదని. మీ ప్రేమలో మరొకరు పాలు పంచుకోలేదని మనసా, వాచా, కర్మల యందు నా కోసం మీరని, మీ కోసం నేనని అనుకొన్నాను.

కాని, మీ వెనక్కి తిరిగిచూస్తే కనిపిస్తోంది వందన. చెప్పండి. ఎవరా, వందన?''

''ఒక వెన్నెల— ఒక మల్లియ. నీలాంటి ఒక అపరంజి బొమ్మ— వందన'' అన్నాడు మాధవ్ నిట్టూరుస్తూ.

''శాంతీ! నీ మెడలో తాళిగట్టిన క్షణంనుండీ నేటి వరకూ నిన్ను తప్ప మరొకరిని ఎరుగను నేను. నిజం శాంతీ! నిన్ను మోసగించలేదు. కాని, వివాహం కాక మునుపు వందనతో నా పరిచయం— ప్రణయం చాలా చిత్రంగా జరిగింది. దయచేసి అర్థం చేసుకొంటావు కదూ!''

అతను చెప్పనారంభించాడు.

ఇద్దరు శ్రోతలు ఆ కథలో లీనమయిపోయారు.

* * *

అది విశాఖ బీచి!

మాధవ్ కూర్చున్నాడు ఒంటరిగా.

విదియనాటి మసక వెలుతురు కురుస్తోంది మత్తుగా.

రాత్రి తొమ్మిది దాటింది.

ఒక్కొక్కరే ఆ ప్రదేశాన్ని విడిచి వెడుతున్నారు— గృహాభిముఖంగా.

ఇంతలో—

మాధవ్‌కి కొద్ది దూరంలో ఒక స్త్రీ వడివడిగా వెడుతోంది— సముద్రం లోనికి.

ఆమెవైపు చూసాడు మాధవ్.

ఆమె నడకలో వేగం ఉంది. దూరంనుంచైనా సరే, ఆమె ముఖకవళికలలో ఆందోళన వ్యక్తం అవుతోంది.

కంగారు కనిపిస్తోంది.

మాధవ్‌కి ఎందుకో అనుమానమొచ్చింది.

గబుక్కున లేచాడు.

వేగంగా— అతి వేగంగా పరిగెత్తాడు.

వెనకనుండి అనుసరిస్తున్నట్లున్న అడుగుల సవ్వడివిని ఆమె పరుగందుకుంది.

మాధవ్‌కి భయం పట్టుకుంది.

నిజమే!

ఆమె జీవితాన్ని అర్ధాంతరంగా అంతం చేసుకొందామనుకొంటోంది.

ఆత్మహత్యకు ప్రయత్నిస్తోంది.

వడివడిగా వెళ్ళి ఆమెను చేరుకొన్నాడు మాధవ్. ఆమె భుజంమీద చేయివేసి తనవైపుకి తిప్పుకొన్నాడతడు.

అప్పటికే—

ఆమె పాదాలు నీటితో తడిసిపోయాయి.

ఎగిసిపడే కెరటాలవల్ల ఆమె చీర కొద్దిభాగం తడిసిపోయింది. ఆమె మొండిగా విదుల్చుకునే ప్రయత్నం చేస్తూ అంటోంది—

"వదలండి, నన్ను! నాకు చావాలని ఉంది. మీరెవరు నన్ను అడ్డుకోవడానికి. ప్లీజ్! వదలండి" ఆ మసక వెలుతుర్లో ఆమె కళ్ళల్లో భయం ప్రస్ఫుటంగా కనిపించింది మాధవ్‌కి.

"ప్లీజ్! దయచేసి నా మాట వినండి. మీరెందుకా నిర్ణయానికి వచ్చారో చెప్పండి. మీ సమస్య చెప్పండి. పరిష్కారం ఉందో లేదో ఆలోచిస్తాను. ఆ తరువాత నాకూ పరిష్కారం దొరకదన్పిస్తే— నిజం— నేను మిమ్మల్ని ఈ ఒడ్డున వదిలి వెడతాను" అన్నాడు మాధవ్.

ఆమె ఇసుకలో కూర్చుండిపోయింది. మోకాలిలో తలదూర్చుకుని ఏడుస్తోంది. ఆమె పక్కలు కదులుతున్నాయి— ఆమె వెక్కిళ్ళకు.

క్షణంసేపు అలా వుండనిచ్చాడు ఆమెను దుఃఖ వేగం కొంత తగ్గాక కళ్ళు తుడుచుకొని తల ఎత్తిందామె.

"రండి, ఇంటికి వెడదాం" మాధవ్ అన్నాడు.

"హాస్టల్లో వుంటున్నాను" అందామె.

"రండి అక్కడికే"

"నేను రాను"

నెమ్మదిగా ఆమెను లేవనెత్తి నడిపించసాగాడు మాధవ్.


ఇసుకలో పాదాలు మెత్తగా పడుతున్నాయి. ఆమెవంక చూశాడు మాధవ్.

కాటుక కరిగి చెక్కిలిదాకా వ్యాపించింది అయినా, ఆమెకది అందంగానే ఉంది.

మెరుపు తీగలా సన్నగా ఉందామె. పసిమిఛాయ. కట్టుకున్న చీర కాస్త ఖరీదైనదే.

"ఎందుకిలా నిశ్చయించుకుందో?" ఆలోచిస్తున్నాడు మాధవ్. అతనికి అందలేదు.

అయినా, ఆమెనడగాలనుకోలేదు. రో



డ్డుమీదికి వచ్చిన తర్వాత టాక్సీని పిలిచి బలవంతాన ఎక్కించాడామెను.

"ఎక్కడికి?"

"మీకేం ఫరవాలేదు. మా ఇంటికే"

పది నిముషాలలో టాక్సీ మాధవ్ ఇంటిముందు ఆగింది.

ఇద్దరూ దిగారు.

"మా అమ్మగారు" పరిచయం చేసాడు ఆమెకి మాధవ్– తల్లిని.

"నమస్కారం"

"నమస్తే! రామ్మా, రా! కూర్చో" సాదరంగా ఆహ్వానించింది మాధవ్ తల్లి.

"పేరు"

"వందన"

ఆమె అక్కడే సోఫామీద కూర్చుంది. మాధవ్‌కి తల్లి కళ్ళలో ప్రశ్న కనిపించింది.

చిరునవ్వు నవ్వాడు కనుసైగచేసి.

వందనకి ఇబ్బందిగానే ఉంది ఈ వాతావరణం. మాధవ్ తల్లికి మాట్లాడాలని వున్నా ఎలా సంభాషణ ప్రారంభించాలో తెలియక తికమక పడుతోంది.

మాధవ్ పరిస్థితి ఇంచుమించు ఇంతే!

"అమ్మా! మంచినీళ్ళు తీసుకురా!" అన్నాడు మాధవ్.

ఆవిడ లోపలికి వెళ్ళింది.

"మీకేం భయం లేదు. మీ ఇల్లులాగానే భావించి రెస్టు తీసుకోండి" అన్నాడు మాధవ్.

ఆమె మాట్లాడలేదు.

ఆమె ముఖంలో నిరాశ ఉంది. నిస్పృహ ఉంది. దైన్యం ఉంది.

భోజనానంతరం ఆమెకో గది చూపించాడు మాధవ్– పడుకొమ్మని.

ఆ తరువాత అడిగింది మాధవ్ తల్లి మాధవ్‌ని.

విషయం వివరించి చెప్పాడు మాధవ్.

ఆమె గుండె కుదుటపడింది.

మాధవ్ అయిదేళ్ళవాడుగా వున్నప్పుడే కారు ప్రమాదంలో తండ్రిని కోల్పోయాడు.

అప్పట్నుంచి శ్రమపడి చదివించి ఓ ఉద్యోగస్థుణ్ణి చేసింది.'అత్తగారి హోదా' రావడం కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తోంది. సల్లక్షణమయిన పిల్లకోసం వెదుకుతోంది నలుమూలలా. అయితే– ఏ అమ్మాయో వచ్చి ప్రేమించానంటూ వెంటబడితే...

"భగవంతుడా!" అనుకొంది మొదట్లో. సంగతి తెలిసాక కుదుటబడి అనుకొందామె– "మాధవ్‌కి వీలైనంత త్వరలో పెళ్ళి చేసెయ్యాలి"

* * *

తెల్లవారింది.

వందన లేచింది. ఆమె మానసికంగా కుదుటపడింది.

కాఫీ తాగుతూ అడిగాడు మాధవ్– "ఇప్పుడు చెప్పండి, మీ సమస్యేమిటి?"

తల దించుకుని నెమ్మదిగా అంది– "చాలా చిన్నదే"

"చెప్పమ్మా! జీవితం జీవించడానికే! కాని, భయపడి వెన్నుచూపి అర్ధాంతరంగా ఆత్మహత్యచేసుకోవడానికి కాదు. చెప్పు"

"జీవితంలో మొట్టమొదటిసారిగా తెలు

సుకొన్నాను— మనుషుల్లోకూడా జంతు ప్రవృత్తి వుందని'' కసిగా అంది వందన.

ప్రశ్నార్థకంగా చూశాడు మాధవ్.

క్లుప్తంగా చెప్పింది వందన— ''ఇంటర్ ఫస్ట్‌క్లాసులో పాసయ్యాను. కొత్తగా కాలేజీలో జాయినయ్యాను. హాస్టల్లో చేరగానే 'రాగింగ్' పేరుతో హింసించారు నన్ను. మారుపేర్లు పెట్టి ఉడికించారు నన్ను. సహించాను. కాని... కాని... ఆడవారే 'జయమాలిని' నృత్యం చేయమంటూ నలుగురిలో నా చీర లాగేశారు. అబ్బ! తలుచుకోలేను ఆ దృశ్యం ...'' బాధగా కళ్ళు మూసుకొంది వందన. అవమానం బలవంతంగా అపుకొంటున్నట్లు కందిపోయింది ఆమె ముఖం.

కనురెప్పలు దాటి ఉబికిన కన్నీరు చెక్కిలిదాటి పయ్యెదపైబడి ఇంకిపోయింది.

నిట్టూర్చాడు మాధవ్.

రాగింగ్ అనేది కాలేజీ వాతావరణంలో కొత్తవారు బిడియపడకుండా నలుగురిలో హారవగా కలియడం కోసం చేయడం సహజం. కాని,

మరీ ఇంత దారుణంగానా?

ఒక సున్నితమైన మనస్సుని బాధపెట్టి తద్వారా సంతోషపడుతున్నారంటే అది 'రాగింగ్' కాదు.

మనిషిలోని రాక్షస ప్రవృత్తి.

శాడిజం— కేవలం అంతే!

అదే అన్నాడు పైకి మాధవ్.

''అవును, బాబూ! ఎటువెడుతుందో తెలియకుండా అడుగులు వేస్తోంది నేడు యువతరం. ముందుకుపోతున్నా మనుకొంటూనే వెనక్కి... ఇంకా వెనక్కి రాతియుగం నాటికి వెళ్ళిపోతున్నాం మనం. సృష్టి పరిణామం చెందగా మనం నేడు మానవాకారాలతో తిరుగుతున్నా— నాగరికంగా మసులుకొంటున్నా మనుకొంటున్నా మనలో ఎక్కడో దాగివుంది. తొలినాటి దశలోని జంతు ప్రవృత్తి. పాశవిక ప్రవృత్తి'' అంది మాధవ్ తల్లి.

''చూడండి, వందనా! జీవితం మనం



# పువ్వులు

వసుందర భర్తతో అంది—

''ఎదురింటి సుబ్బారావు చూడండి... పెళ్ళాన్ని పువ్వుల్లో పెట్టి పూజిస్తాడట!''

''ఒసే పిచ్చి మొహమా! పోయిన భార్య ఫోటోని పువ్వుల్తో కాక మరి దేనితో పూజిస్తారే?''

ఎండి. రహమవాలి (శ్రీశైలం ప్రాజెక్టు)

చూసే కోణంబట్టి మారుతుంది. దాన్ని అందంగా తీర్చిదిద్దుకోవాలి ఒక కళాకారుడి లా. సమస్యవస్తే ఎదుర్కోవాలి ఒక సమర యోధుడిలా స్థైర్యంతో— గుండె ధైర్యం తో'' అన్నాడు మాధవ్.

''చూడమ్మాయి, వందనా! నీవిక్కడ ఒంటరిగా ఉన్నాననుకోవద్దు. ఎప్పుడు పడితే అప్పుడు మా ఇంటికి రా! నీకు మీ వూర్లో వున్న మీ అమ్మగార్లా ఇక్కడ నేనున్నాను'' అంది మాధవ్ తల్లి.

ఇద్దరి దగ్గరా వీడ్కోలు తీసుకొంది వందన.

కృతజ్ఞతలు తెలియజేసుకొని.

ఆమె మనసు దూదిపింజలా తేలియాడులోంది.

నిన్న తనెంత తొందరపడిందో తెలుసుకొంది.

అంతే— అదో బలహీన క్షణం.

* * *

వందన, మాధవ్‌ల పరిచయం బాగా పెరిగింది.

ఇద్దరి కళ్ళూ— కళ్ళూ కలుసుకుని మూగభాషలో బాసలు చేసుకుంటున్నాయి.

ఇద్దరిలో ఏదో ఆకర్షణ వలపు సంకెలవుతుంటే భవితవ్యంపై ఎన్నో కలలు—

'రామకృష్ణా బీచి'లో ఎన్నో కలయికలు.

ఒకసారి—

ఇద్దరూ 'జగదాంబ'కి వెళ్ళారు ఆంగ్లచిత్రం చూడడానికి.

''హలో! మాధవ్'' విష్ చేసాడు మాధవ్ స్నేహితుడు సుధాకర్— థియేటర్లో అడుగుపెడుతుంటే.

మాధవ్ పక్కన వందనలో— 'జస్టేమినిట్' అని అతని దగ్గరగా వెళ్ళాడు.

ఇద్దరూ ఏదో దీర్ఘంగా చర్చించుకొంటున్నారు.

బుకింగ్ కౌంటరు ఓపెన్ చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

వందన నిలుచుంది ఒకవారగా మాధవ్ రాకకోసం ఎదురుచూస్తూ. ఆమె ముంగురులు అటూఇటూ ఊగుతున్నాయి నుదుటిమీద అల్లరిగా.

పైట భుజంమీదనుండి తీసుకుని నడుం వద్ద లోపలికి దూర్చింది. అందమైన 'అజంతా ప్రతిమ'లా చూపరులకు దృగ్గోచరమౌతోంది ఆ నిలబడిన భంగిమ చూస్తే.

''ఏమనుకోకు! ఒక విషయం అడుగుతున్నాను'' అతనన్నాడు మాధవ్‌తో.

''అడుగు''

ఆ మాటలు లీలగా వినిపిస్తున్నాయి వందనకి.

''మీ వుడ్‌బియా! నైస్! కంగ్రాచ్యులేషన్స్. మీ పెయిర్ కనులకింపుగాఉంది'' అంటున్నాడతడు. వందన ముఖం రాగరంజితమయింది.

* * *

''వందనా!''

''ఊ'' మత్తుగా మూలిగింది వందన. ఆమె శిరోజాలలో మల్లెలు సువాసన వెదజల్లుతూ మాధవ్‌ని పిచ్చెక్కిస్తున్నాయి. ఆమె భుజంమీద తలవాల్చాడు మాధవ్.

''మనం పెళ్ళి చేసుకుందాం'' అన్నాడు మాధవ్.

''తప్పకుండా! మిమ్మల్ని వదిలి ఒక్కక్ష

ణంకూడా ఉండలేను— నిజం'' అంది వందన.

వందనలో మార్పొచ్చింది. దేనినయినా ఎదుర్కొనే ధైర్యం వచ్చింది. స్నేహితుల ఎగతాళి మాటలకు, కవ్వింపులకు సరదాగా నవ్వుకొనే స్థితికి ఎదిగింది వందన.

మాధవ్, వందనలిద్దరూ ఏకాంతంగా కలుసుకొంటున్నారు— ఎక్కువగా.

ఉదయాన్నే 'భీమిలి' వచ్చారు.

కెరటాలు వచ్చి వారి కాళ్ళు కడుగుతున్నాయి.

మాధవ్ కళ్ళు కాంక్షతో ఎరుపెక్కుతున్నాయి.

వందన కళ్ళు అరమోడ్పులయ్యాయి. మాధవ్ చేతులు చుట్టేస్తున్నాయి వందనని.

''ఏం జరుగబోతోంది?'' గబుక్కున విదిలించి లేచింది వందన.

''ఏమిటి?'' అడుగుతున్నాడు మాధవ్.

''ఏం లేదు''

నడుస్తోంది వందన బీచి కెదురుగా వున్న శిథిల భవంతులవైపు.

అనుసరించాడు మాధవ్ మౌనంగా.

ఆమె మాట్లాడలేదు. ఆ గంభీర వదనాన్ని తిలకిస్తూ పలకరించే ప్రయత్నం చేయలేదు మాధవ్.

శిథిల భవనంలో ఒక గోడమీద బొగ్గుతో అక్షరాలు చెక్కుతోంది వందన.

ప్రక్కనే లవ్‌సింబల్ కూడా వేసింది— హృదయంలో పూలబాణం గుచ్చుకొన్నట్లు.

కింద తేదీకూడా రాసింది.

''ఏమిటిది పిచ్చి'' అన్నాడు మాధవ్.

''ఊహూ! పిచ్చికాదిది. ప్రేమపిచ్చి'' అంది వందన.

ఆమె కళ్ళు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి.

తరువాత అంది నెమ్మదిగా— ''చూడు, మధూ! మనం ప్రేమించుకొన్నాం. పెళ్ళి చేసుకొని భార్యాభర్తలమౌతాం. రొటీన్

## టాప్



*పదేళ్ళ క్రితం మిధున్ చక్రవర్తికి 'బాండీవ్' వచ్చింది. అప్పట్లో పాతిక సినిమాలుపైగా ఉన్నాయి అతడి చేతిలో. అన్ని సినిమాలున్నా ప్రొడ్యూసర్స్ గురించి ఆలోచించలేదు మిధున్.*

*ప్రస్తుతం మిధున్ 'బాండీవ్'తో బాధపడుతున్నాడు. ఒకటో— రెండో సినిమాలున్నాయి చేతిలో — ఇప్పుడతడి ఆలోచనలన్నీ ప్రొడ్యూసర్స్ మీదే...*

*టాప్‌కి... ఫ్లాప్‌కి తేడా ఇదే...*

*ఫ్లాప్ హీరో అయినా డేర్ చేశారు. కానీ... ఫ్లాప్‌కితోడు సిక్‌కూడా అయితే... ఆ నిర్మాతలు మరో హీరో గురించి ఆలోచించకపోతే ఎలా?*

—వింజమూరి కృష్ణమూర్తి

లైఫ్‌లో ఎప్పుడైనా కాస్త రిలీఫ్ కావాలనుకుంటే ఆరోజు ఇక్కడికి వద్దాం. మనమీద మనకు కలిగిన విసుగునుంచి మనం దూరమవుతాం. ఈ శిథిలభవనాన్ని చూస్తుంటే— ఈ చెరగని అక్షరాలను చూస్తుంటే ఈనాటి అనుభూతి మళ్ళీ గుర్తుకురాక మానదు. అప్పుడు భార్య అయిన నాలో నీ ప్రేయసి, భర్త అయిన నీలో నా ప్రియుడు కనబడతాడు. కనపడతాడు.''

* * *

సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగిరి ఒడ్డుకు చేరి అంతలోనే విరిగి వెనక్కి ఒరిగిపోతున్నాయి. 'రొండు బంగళా'లో ఒక విండోదగ్గర నిల్చొని చూస్తున్నాడు— కడలిని

మనసుకి కళ్ళున్న ప్రతివారిని ఇట్టే ఆకట్టుకొనే సౌందర్యరాజ్ఞి— ఈ భీమిలి.

బీచికెదురుగా రెండు శిథిలభవంతులు— ఎంతో చరిత్రని తమలో దాచుకొని ఎంతో వైభవాన్ని అనుభవించి ఈనాడు పతనమైనా గత వైభవ చిహ్నాలతో అలరారుతున్నాయి.

మాధవ్ బైటకు వచ్చి మరో శిథిల భవనం లోనికి నడిచాడు.

గోడలనిండా బొగ్గుతో రాసిన రాతలు—

పిచ్చిబొమ్మలు—

ముగ్గులు

సెక్స్‌గీతలు--

అన్నీ పలుకరిస్తున్నాయి మాధవ్‌ని.

ఇంకా లోపలికి వెడుతున్నాడు మాధవ్.

''అవును— ఈ గదిలోనే— ఈ గదిలోనే'' అతడు నెమ్మదిగా గొణుక్కొన్నాడు.

వెదుకుతున్నాడు కావలసినదాన్ని వళ్ళంతా కళ్ళు చేసుకొని.

''బాలు—స్వప్న'' పేర్లు కొట్టొచ్చినట్లు కన్పించాయి.

వందన గొంతు విన్పించింద్రతనికి. ఆ విశాలమైన భవంతిలో తరంగాలు— తరంగాలుగా— ''ఇక్కడే కదూ 'మరోచరిత్ర' షూట్ చేశారు''.

''అవును— ఇక్కడే'' మాధవ్ సమాధానం.

''మన ప్రేమకూడా 'మరోచరిత్ర' కావాలని'' మిగతామాటలు నోటివెంట రాకుండా ఆమె పెదవులమీద చేయివేశాడు మాధవ్.

అది ఓ జ్ఞాపకంగా మిగిలిందీనాడు.

అతని కళ్ళు అశ్రుపూరితాలయాయి.

''థాంక్‌గాడ్! దొరికింది'' అతని ఒళ్ళు గగుర్పాటు చెందిందో నిముషం.

అక్కడ రాసున్నాయి కొన్ని అక్షరాలు.

''వందన—మాధవ్'' దాని పక్కనే లవ్ సింబల్.

18 జూన్ 1977.

వందన తన చేత్తో స్వయంగా రాసిన అక్షరాలు.

నెమ్మదిగా చేత్తో తడిమాడు మాధవ్— ఆ 'వందన' పేరుని.

ఏదో ఆనందం—

ఏదో అనుభూతి—

అతను వశం తప్పిపోతున్నాడు. అతను పరవశం చెందుతున్నాడు.

బొగ్గుకోసం చుట్టూ చూశాడు మాధవ్ దొరికింది.

దానికింద రాసాడు మాధవ్ తన పేరుని అందంగా, ఆరోజు తేదీతో సహా.

లెక్కచూసింది అతని మనసు రెండు తేదీల మధ్యకాలాన్ని.

రెండు సంవత్సరాల రెండు నెలల మూడు వారాల రెండు రోజులు.

"ముందుకు వెళ్ళింది కాలం తన జీవితాన్ని వెనక్కి తోసి" బాధగా నిట్టూర్చాడు మాధవ్.

"ఆవిడిప్పుడెక్కడుంది?" అడిగింది శాంతి అతని భుజంమీద ఓర్పుగా, ఓదార్పుగా చేయివేసి.

ఆకాశంవైపు చూపించాడు మాధవ్.

"ఆ!" ఆశ్చర్యపోయాడు తాత.

"అంటే"

"అంతే"

"ఎందుకిలా జరిగింది?"

"ఇలా జరిగింది"

* * *

"ఏమిటిలా వచ్చావ్?" అడిగాడు మాధవ్— వందనని ఆశ్చర్యంగా చూస్తూ.


క్రిందటిరోజే 'భీమిలి'నుండి వచ్చారు. మళ్ళీ ఇంత ఉదయాన్నే వచ్చిందంటే ఏదో బలీయమైన కారణం ఉండకపోదు.

ఆలోచిస్తున్నాడు మాధవ్. అయితే, అతని మొద్దుబుర్రకి ఏ విషయమూ తట్టలేదు.

"నేనింక కాలేజీకి వెళ్ళను" అంది వందన ఏడుస్తూ.

"ఏం? మళ్ళీ ఏమయింది" అడిగాడు మాధవ్ అసహనంగా.

మాధవ్ తల్లికి— మాధవ్—వందనలిద్దరూ భీమ్లీ వెళ్ళారన్న సంగతి ఎలా తెలిసిందో కాని తెలిసిపోయింది. ఆవిడ మాధవ్‌మీద అలిగింది. మాధవ్‌కి వందనమీద ఎంత ప్రేమ, అనురాగం వున్నా అంతకుమించి తల్లిమీద అభిమానం ఉంది. ఆవిడని నొప్పించి వందనని ఈ ఇంట్లోకి తీసుకువచ్చేకన్నా



ఆవిడని ఒప్పించాలన్న కోరిక అతనిలో ప్రగాఢంగా ఉంది.

రాత్రి మాధవ్ ఢిల్లీనుండి వచ్చాక తల్లీకొడుకులిద్దరికీ ఘర్షణ జరిగింది.

ఆ వేడినుండి ఇంకా కోలుకోలేదు మాధవ్. ఇంతలో—

మళ్ళీ ఇంటికే వచ్చింది వందన.

"చెప్పు" అన్నాడు మాధవ్.

వందనని ఉప్పెనలా ముంచివేసింది దుఃఖం. మోకాలిలో తలదూర్చి రోదిస్తోందామె.

"ఏం జరిగింది?"

"నన్నిప్పుడే పెళ్లిచేసుకో! నీ ఇంటికి 'ఇల్లాలి'గా ఇప్పుడే ఆహ్వానించు" అంది వందన.

"వందనా! ఏమిటిది. నిదానంగా ఆలోచించు. ఇప్పటికిప్పుడంటే ఎలా? తప్పకుండా నిన్ను పెళ్ళి చేసుకుంటాను. కాని, అమ్మని వప్పించాలి కదా!" అంటున్నాడతడు.

"నో! భరించలేను ఈ ఆలస్యం. ఇప్పుడే గుళ్ళోకి వెళ్ళి దండలు మార్చుకొందాం. భార్యభర్తలమౌదాం" అంది వందన.

"అలాగే— ఇప్పుడు కాదు. ఒకటి రెండురోజులాగు"

"అంటే! అంతవరకూ నేనుండలేను. ఈ లోకంలో తలెత్తుకుని తిరగలేను"

"ఏం ఎందుకు?" కోపంగా అన్నాడు మాధవ్.

"నీకు తెలీదు నా బాధ! మనిద్దర్నీ ఎగతాళి చేసిన ఈ లోకానికి మనిద్దరం భార్యాభర్తలమని చెప్పాలని వుంది" వందన.

"అలాగే వందన. కాని పరిస్థితి ఆలోచించు"

వందన కోపంగా లేచిపోతూ అంది— "అందరూ స్వార్థపరులే. వారి ప్రమేయం వల్ల మరొకరి జీవితం నాశనమౌతున్నా ఉలకరు— పలకరు. అంతే— అంతే"

వడివడిగా వెళ్ళిపోయింది వందన— వెనకనించి మాధవ్ పిలుస్తున్నా వినిపించుకోకుండా.

మాధవ్‌కి పిచ్చెక్కినట్లనిపించింది.

వందన సున్నిత హృదయం మళ్ళీ గాయపడినట్లుంది.

అందుకే సాంత్వనకోసం, ఓదార్పుకోసం తన దగ్గరికి వచ్చింది.

కాని తనేం చేసాడు.

ఉడికిపోతున్న వందన కోపంగా వెళ్ళింది

.

వందనని కలుసుకోవాలి.

గబగబా డ్రసు చేసుకొని స్కూటరుమీద బయలుదేరాడు మాధవ్.

కాలేజీ ముందుకు రాగానే అతని ముఖం వివర్ణమయింది.

కోపంతో ఉడికి పోతున్నాడతడు కూడా

.

అక్కడ స్కూటర్ ఆపలేకపోయాడు. స్టార్ట్‌చేసి వెంటనే బయలుదేరిపోయాడు.

కాలేజీ గోడలనిండా 'వందన— మాధవ్' పేర్లే జంటగా రాసున్నాయి.

"ఫిమిలీలో వందన—మాధవ్‌ల ప్రేమాయణం" శీర్షికతో అసభ్యవర్ణనలతో అసభ్య

చిత్రాలు లిఖించారెవరో.

* * *

"అంతే! వందన సూసైడ్ చేసుకొంది" అన్నాడు మాధవ్.

"ఆ!" శాంతి నోటివెంట మాట రావడం లేదు. ఎంత విషాదం దాగివుంది ఇతని గుండెలలో!

"నిజం, శాంతీ, వందన చనిపోయాక నాకు పెళ్ళి చేసుకోవాలనిపించలేదు. నా పెళ్ళిగురించి అమ్మచేయని ప్రయత్నమూ లేదు. కాని, నిన్ను చూసాక మళ్ళీ పెళ్ళి మీదకు మనసు మళ్ళింది. కారణం— వందన నీలో వుంది. నవ్వుతున్నప్పుడు మెరిసే నీ కళ్ళలో కన్పిస్తోంది వందన నాకు.


ఇదే ఛాయ, ఇదే పొడుగు, ఇదే సన్నం. ఆఖరికి ముఖకవళికల్లో కూడా 'వందన'లాగే ఉన్నావు నీవు. అందుకే— నిన్ను పెళ్ళిచేసుకొన్నాను" చెప్పాడు మాధవ్.

మళ్ళీ— "చూడు, శాంతీ! ఈ ఇసుక తిన్నెల మీద నడిచిన ఎందరి ప్రేమికుల అడుగుజాడలు చెరిగిపోయాయో, కదా! ఈ నీలి సముద్రపు కౌగిట్లోకి విఫల మనోరథులైన ఎందరు ప్రేమికులు ఆత్మత్యాగం చేసారోకదా! ఈ శిథిల భవంతుల గోడలమీద రాతల్లో జంటగా బతికేస్తున్న ఎందరు ప్రేమికులు నిజ జీవితంలో విడివడ్డారో కదా!"

"అవును, బాబూ! అవును అంతా 'విధి'. మన చేతుల్లో ఏం మిగిలివుందని" నిరాశగా అన్నాడు తాత గుడ్లనీరు కుక్కుకుని.

మాధవ్ వేడిగా నిట్టూర్చాడు.

"ఒకరోజు తన జైత్రయాత్ర ముందు తరాల వారికి తెలియాలని శిలాఫలకాలు లిఖించిన వారసత్వం మనది. గోడలమీది కొన్ని రాతలు జంటలను కలిపి శాశ్వతంగా వారి హృదయాలపై చెరుగని ముద్రవేస్తే, గోడలమీది మరికొన్ని రాతలు జంటలను విడదీసి హృదయాలను జ్వలింపజేస్తాయి.



## బాధ

రాజకీయ నాయకుడ్ని అడిగాడు విలేకరి—

"నిన్న పోలింగ్ సమయంలో జరిగిన కొట్లాటలో మీ పార్టీ కార్యకర్తలు పదిమంది చనిపోయారు కదా! మీకు బాధనిపించదా?"

'ఆ... ఓటు వేయకుండానే పోయినందుకు' చెప్పాడు నాయకుడు

—దుర్గాశేఖర్ (తగరపువలస)

సంవత్సరం గిర్రున తిరిగింది.

శాంతి ఒడిలో ముద్దులొలుకుతున్న పసి పాప పరవశించి వుంది.

పక్కనే మాధవ్ కూర్చున్నాడు.

పురోహితుడు మంత్రాలు చదువుతు న్నాడు. మాధవ్ చేతిలో బియ్యంపోసి వున్న పళ్ళెం వుంది.

శాంతివంక చూసి అడిగాడు మాధవ్.

''పాపకి ఏం పేరు పెడదాం?''

శాంతి ఆలోచిస్తోంది. ఎన్నో పేర్లు ఆమె మనసులో మెదులుతున్నాయి.

దీప్తి—

సమీర—

మృణాళిని—

బృంద—

వందన—

''వందన'' అది శాంతి.

''వందన'' తన్మయంగా అంటూ బియ్యంలో రాశాడు మాధవ్ అదే పేరుని.

*

## కుర్రాళ్ళు



రాజ్‌కుమార్ కోహ్లీ నిర్మిస్తోన్న 'విరోధి' సినిమాలో ఆయన కొడుకు అర్మాన్ హీరో, హర్ష (కొత్తనటి) హీరోయిన్.

హీరో హీరోయిన్స్‌కి తండ్రులుగా నటించమని కోహ్లీ.. తన పాత స్నేహితులు ధర్మేంద్రని, సునీల్‌దత్‌ని అడిగితే—

'అమ్మో! తండ్రులుగానా... మేం నటించం' పొమ్మన్నారుట. మేమంతా తండ్రి పాత్రలు పోషించే అంత పెద్దవాళ్ళం కాదు అనికూడా అన్నారు.

దాంతో కోహ్లీ ఖంగుతిన్నాడు.

అయితే 'విరోధి' సినిమాలో ధర్మేంద్ర, సునీల్‌దత్ నటిస్తున్నారు. కానీ తండ్రులుగా కాదు... అన్నలు (హీరో, హీరోయిన్స్)గా.

కోహ్లీ కథ అనుగుణంగా మార్చుకున్నాడు.

—వింజమూరి కృష్ణమూర్తి

***Edited Printed and Published by T. Venkatram Reddy on behalf of Deccan Chronicle from 36, Sarojinidevi Road, Secunderabad-500 003 Editor-in-Charge C. Kanakambara Raju. Phone: 76346.***